నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద సిద్ధంగా ఉంచిన వెదురు తెప్పలు


సిద్ధేశ్వర గుండం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

- పరిశీలించిన కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు
- అందుబాటులో క్రేన్లు, తెప్పలు, గజ ఈతగాళ్లు
- విద్యుత్ వెలుగుల్లో నిమజ్జన ప్రాంతాలు

నిమజ్జనానికి సర్వం సిద్ధం

ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల వద్ద ఏర్పాట్లు

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 15: ఉమ్మడి జిల్లాలో కొలువుదీరిన గణనాథులు తొమ్మిదిరోజులపాటు పూజలందుకుని నిమజ్జనానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆరు జిల్లాల్లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. నిమజ్జనానికి వెళ్లే రహదారుల మరమ్మతులతోపాటు విద్యుత్ లైట్లు, బారికేడ్లు, ప్రతి చెరువు వద్ద క్రేన్‌లతోపాటు తెప్పలు అందుబాటులో ఉంచారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. పారిశుధ్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా కార్మికులను నియమించారు. హనుమకొండ ప్రాంతంలో 14 , వరంగల్‌లో 7 చెరువుల వద్ద 28 క్రేన్లను ఏర్పాటు చేశారు. వరంగల్ కోట చెరువులో నిమజ్జనం నిషేధించా రు. నిమజ్జన చెరువుల వద్ద ఏర్పాట్లను మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, సిటీ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాతోపాటు ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు గణనాథులను కాళేశ్వరం వద్దే నిమజ్జనం చేస్తారు. కలెక్టర్ రాహుల్ శర్మ,ఎస్పీ కిరణ్‌ఖరే గోదావరి వద్ద గజ ఈతగాళ్లను, తగు పరికరాలను సిద్ధం చేశారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల చెరువును ఇప్పటికే కలెక్టర్ షేక్ రిజ్వానా బాషా, సీపీ అంబర్ కిశోర్ ఝా, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ పరిశీలించారు. ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని నిజాం చెరువు వద్ద సర్వసిద్ధం చేశామని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం నిజాం చెరువు వద్ద నిమజ్జ న ఏర్పాట్లను ఎస్పీ సుధీర్ రాంనాథ్‌తో కలిసి పరిశీలించారు.

• రోడ్లిలా.. నిమజ్జనానికి వెళ్లేదెలా?

- చిన్నవడ్డేపల్లి చెరువులో వినాయక విగ్రహాలను తరలించడమెలా?
- తలలు పట్టుకుంటున్న మండపాల నిర్వాహకులు

పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేటకు వెళ్లే మూల వద్ద గుంతలతో ఇరుకుగా ఉన్న రోడ్డు

వాటర్‌పైప్‌నకు మరమ్మతు చేసి పూడ్చకపోవడంతో ఇరుకుగా మారిన దేశాయిపేట రోడ్డు

వివిధ ప్రాంతాల్లో నవరాత్రులు పూజలందుకున్న వినాయక విగ్రహాలను డప్పుచప్పుళ్లు, భాజా భజంత్రీలు, కోలాటాలు, నృత్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి దేశాయిపేటలోని చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేస్తారు. ఊరేగింపు సాఫీగా సాగాలంటే రోడ్డు మార్గం గుంతలు లేకుండా అనువుగా ఉండాలి. కానీ, పోచమ్మమైదాన్ జంక్షన్ వద్ద రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా తయారైంది. రెండు నెలల క్రితమే పైపులైన్ లీకేజీ వల్ల పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకపోయింది. కార్పొరేషన్ అధికారులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చారే తప్ప ప్రజల బాధలు తీరలేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డుపై ఎలా ప్రయాణం ఎలా చేయాలంటూ మండపాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– పోచమ్మమైదాన్/వరంగల్ ఫొటోగ్రాఫర్

• ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తి.. కాడెపట్టి..

రాంపురం గ్రామంలో రైతుల అవస్థలు

భారీ వర్షాలతో మండలంలోని రాంపురం గ్రామంలో పిడుగుపడి వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. వరద తాకిడికి రహదారి కొట్టుకుపోయింది. తమ పొలాలు ఎండిపోతున్నాయని తెలిపినా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో రైతులే స్వయంగా ఎడ్లబండిపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తి కాడెపట్టి పత్తి చేన్ల నుంచి తరలించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

– మరిపెడ, సెప్టెంబర్15

తాడ్వాయి అటవీ ప్రాంతంలో 500 ఎకరాల్లో నేలకూలిన భారీ వృక్షాలు(ఫైల్)

- ప్రాథమికంగా నిర్ధారించిన అటవీ శాఖ
- తాడ్వాయి అటవీ ప్రాంతంలో 500 ఎకరాల్లో నేలకూలిన చెట్లు
- 1984లో ఇక్కడ ఇదే తరహా విపత్తు
- అప్పుడు పస్రాలోని లవ్వాల ప్రాంతంలో ఉపద్రవం
- ప్రభావిత గ్రామాల్లో తీవ్ర నష్టం

సమాంతర ఉధృత గాలుల(స్ట్రెయిట్ లైన్ విండ్స్ స్టార్మ్) వల్లే ములుగు జిల్లా తాడ్వాయి అటవీ ప్రాంతంలో 500 ఎకరాల్లో చెట్లు నేలకూలినట్లు అటవీ శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. గాలి పీడ నం తీవ్రంగా ఉన్నప్పుడు దాని మార్గంలో ఏదైనా అడ్డుగా వస్తే కూల్చేస్తుంది. ఇదే రకమైన విపత్తు ఇక్కడ జరిగినట్లు ఫారెస్టు శాఖ అధికారుల పరిశీలనలో తేలింది. ఈ డౌన్ బరస్ట్ చుట్టుపక్కల గ్రామాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 1984లో పస్రాలోని లవ్వాల అటవీ ప్రాంతంలో ఇదే తరహాలో ఉపద్రవం వచ్చిందని పేర్కొంటున్నారు.

– వరంగల్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

డౌన్ బరస్ట్ వల్లే..

అడవుల విపత్తుకు స్ట్రెయిట్ లైన్ విండ్స్ స్టార్మే కారణం

మేడారం–తాడ్వాయి రోడ్డులో కొండేటి వాగు నుంచి కొండపర్తి వరకు ఆగస్టు 31న సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు దట్టమైన మేఘాలతో, గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీచిన సమాంతర ఉధృత గాలుల(స్ట్రెయిట్ లైన్ విండ్స్ స్టార్మ్) వల్ల 500 ఎకరాల విస్తీర్ణంలోని అటవీ సంపద పూర్తి గా దెబ్బతిన్నది. దాదాపు 60 వేలకుపైగా దట్టమైన చెట్లు కూలిపోయాయి. తక్కువ లోతులో ఉండి విస్తరించే లక్షణం ఉన్న వందేండ్ల వృక్షాలు కొమ్మల వల్ల ఉధృతి, గాలి, వాన నీటి బరువుకు ఊగి కూకటి వేళ్లతో సహా నేల కొరిగాయి. చిన్నగా, సన్నగా ఉన్న చెట్లు సగానికి విరిగి తెగి పడ్డాయి. ఈ ప్రాంతంలో అంతా ఇసుక నేలలే కావడం, 4 అడుగుల కింది నేలలో రాతి గుండ్లు ఉండడం వల్ల చెట్ల వేరు వ్యవస్థ లోపలికి కాకుండా సమాంతరంగా వ్యాపించి ఉన్నది. అంకుశంగా ఉండాల్సిన తల్లి వేరు కొద్ది దూరం వరకే ఉండడంతో పెద్ద చెట్లు కూలిపోయాయి. సమాంతర ఉధృత గాలుల తరహా ఉపద్రవం మన రాష్ట్రంలోనూ గతంలో వచ్చినట్లు అటవీ శాఖ రిటైర్డ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 10 అటవీ బృందాలు పడిపోయిన చెట్లను లెక్కిస్తూ సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. అటవీ శాఖ సిబ్బంది నిరంతరం గస్తీ తిరుగుతూ దెబ్బతిన్న అటవీ ప్రాంతాన్ని సంరక్షించే ప్రక్రియను మొదలు పెట్టారు. ఇలాంటి సంరక్షణ చర్యలు కచ్చితంగా కొనసాగిస్తే ఐదారేండ్లలో అటవీ ప్రాంతం తిరిగి పునరుజ్జీవమయ్యే అవకాశం ఉంటుంది. విశాలమైన అటవీ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ వాతావరణ పరిశీలన కేంద్రం ఉంటే ఏం జరిగిందనేది కచ్చితంగా తెలిసేదని చెబుతున్నారు. తాడ్వాయి అటవీ ప్రాంతంలో వాతావరణ పరంగా జరిగిన ఉపద్రవం ఏమిటనే నివేదికలు, సమాచారం కావాలని ములుగు జిల్లా అటవీ అధికారి హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ వాతావరణ కేంద్రానికి లేఖ రాశారు. ఆ ప్రాంతంలో వర్షపాత నమోదు కేంద్రమే ఉన్నదని, ఇతర సమగ్రమైన నివేదికలు వచ్చే పరిశీలన కేంద్రం లేదని అక్కడి నుంచి జవాబు వచ్చింది. వాతావరణ నివేదికలు లేకపోవడంతో తాడ్వాయి అటవీ ప్రాంతంలో జరిగిన ఉపద్రవంపై అటవీ శాఖ త్వరగా తుది నిర్ధారణకు రాలేకపోతున్నది.

అడవి ఊరును కాపాడింది

ఇలాంటి ప్రకృతి వైపరీత్యం ఈ ప్రాంతానికి కొత్త అయినా దేశంలో ఎన్నో ప్రాంతాల్లో వస్తున్నది. తుఫాన్ రూపాల్లో ఉపద్రవాలు వచ్చి అడవులు ధ్వంసమవుతున్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం పస్రాలోని లవ్వాల అటవీ ప్రాంతంలో ఇలాంటి నష్టం వాటిల్లింది. ఇప్పుడు స్ట్రెయిట్ లైన్ విండ్స్ వచ్చిన ప్రాంతం చుట్టూ కామారం, ఊరట్టం, మేడారం, కొండపర్తి గ్రామాలు ఉన్నాయి. అడవి కారణంగానే అంత పెద్ద ఉపద్రవం వచ్చినా గ్రామాలు ఉండగలిగాయి. అడవి తాను ధ్వంసమై ఆ గ్రామాలను కాపాడింది. ఈ ప్రక్రియే అడవులు మానవాళికి చేసే మేలు. ఇది అనూహ్యమైన వాతావరణ మార్పుల వల్ల జరిగిన ప్రకృతి వైపరీత్యం. కేంద్ర ప్రభుత్వం ఏటూరునాగారంలో వాతావరణ పరిశీలన కేంద్రం(అబ్జర్వేటరీ) ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు చేపట్టవచ్చు.

– కాజీపేట పురుషోత్తం, రిటైర్డ్ జిల్లా అటవీ శాఖ అధికారి, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్మెంటల్ ప్రొటక్షన్ వరంగల్ అధ్యక్షుడు

గ్రామాల్లో తీవ్ర నష్టం

తాడ్వాయి అడవుల్లో వచ్చిన ఉపద్రవంతో కొండపర్తి గ్రామం బాగా దెబ్బతిన్నది. కామారం, ఊరట్టం, మేడారం గ్రామాలు దీని ప్రభావానికి గురయ్యాయి. తీవ్రమైన గాలితో వచ్చిన విపత్తు కారణంగా ఇండ్ల పైకప్పులు లేచి కిలోమీటర్ల దూరంలో పడిపోయాయి. వరదల నష్టంతో ఇండ్లు కోల్పోయిన వారికి ఇచ్చినట్లే తమకూ పరిహారం ఇవ్వాలని కొండపర్తి వాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇండ్లు కోల్పోవడంతో తమ పరిస్థితి దయనీయంగా ఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా సాయం చేయాలని కోరుతున్నారు. విపత్తుతో పశువులను కోల్పోయామని, రాష్ట్ర ప్రభుత్వం దీన్ని పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాళ్లవాగులో కొట్టుకుపోయిన డీసీఎం(ఫైల్)

శవాలు రోదిస్తున్నయ్..

- వరదల్లో కొట్టుకొచ్చినవి కొన్ని.. గల్లంతైనవి మరికొన్ని
- మృతదేహాల కోసం బంధువుల ఎదురుచూపులు

మహబూబాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాను వరదలు ముంచెత్తాయి. దీంతో కూడు, గూడు, గొడ్డు, గోదా.. అన్నీ కొట్టుకుపోయాయి. సుమారు 8 మంది వరకు మృతి చెందారు. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గంగారం తండాకు చెందిన మోతీలాల్, యువ శాస్త్రవేత్త అశ్విని మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద కారుతో సహా కొట్టుకుపోయారు. అదేవి ధంగా తొర్రూరు మండలం వెంకటాపురంలో నర్సయ్య మృతి చెందాడు. మహబూబా బాద్ మండలం ఈదులపూసపల్లి వద్ద రాళ్లవాగులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన నాగభూషణం రాళ్ల వాగులో గల్లంతయ్యాడు. వరదల్లో కొట్టుకుపోయి 15 రోజులు గడుస్తున్నా మృతదేహం లభించకపోవడంతో అతడి బంధువులు ఇటీవల ఎస్పీని కలిసి వెతికివ్వాలని వేడుకున్నారు. అదేవిధంగా బయ్యారం మండలం బంజారా తండా శివారులో పాకాల ఏరులో ఓ శవం కొట్టుకు రాగా, ఆనవాళ్లు పోలీసులకు లభించకపోవడంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మృతదేహాన్ని ఖననం చేశారు. ఈనెల 11న బయ్యారం మండలం సింగారం టు కాలనీకి చెందిన వృద్ధురాలు జహీదాబి మృతదేహం నాలుగు రోజులుగా వెతికిన తర్వాత అలిగేరు ఏటిలో లభ్యమైంది. 13న ధర్మాపురం గ్రామానికి చెందిన పూనం వెంకన్న నామాలపాడు శివారులో ఉన్న జిన్నెల వాగులో పడి మృతి చెందాడు. అదేవి ధంగా కేసముద్రం మండలం కేసముద్రం విలేజ్ ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన భాగవత్ వాణి వరదల్లో చిక్కుకొని వర్షపు నీరు మింగడంతో తీవ్ర అస్వస్థతకు గురై మరణించింది. మానుకోట ప్రాంతం ఏర్పడినప్పటి నుంచి ఎన్నడూ లేనంతగా వర్షాలు కురవడంతో ప్రాణ, ఆస్తి, నష్టాలు సంభవించాయి

మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి సీఎం రావాలి

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

నర్సంపేట రూరల్, సెప్టెంబర్ 15 : నర్సంపేటలోని నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాల, జిల్లా వైద్యశాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి రావాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి, నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా చూడాలన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి నిరంతరం కొనసాగిందని, గత ప్రభుత్వంలో నర్సంపేటకు మెడికల్ కళాశాల తీసుకొచ్చినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాకు కేటాయించిన మెడికల్ కళాశాలను నర్సంపేట పట్టణానికి తీసుకొచ్చి వైద్యశాలను నిర్మించినట్లు తెలిపారు. ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఈ ఏడాది 50 సీట్ల అనుమతి కూడా ఇచ్చిందన్నారు. నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా రూపుదిద్దుకోవాలనే నర్సంపేటకు మెడికల్ కళాశాల మంజూరు చేయించామని చెప్పారు. భవిష్యత్‌లో 150 సీట్లకు పెంచుకొనే అవకాశం ఉందన్నారు. పీజీ కళాశాల రావాల్సి ఉందని, మెడికల్ కళాశాల నిర్మాణం త్వరగా పూర్తి చేయడం వల్ల నర్సింగ్ కళాశాల మంజూరు కావడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలకు శాశ్వత బిల్డింగ్, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సహాయ సిబ్బంది, రెసిడెన్షియల్ భవనాలు, సీట్ల పెంపు, ల్యాబ్స్, ఇతర వసతుల కోసం గత ప్రభుత్వం జీవో నంబర్ 83 ద్వారా రూ.183 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే రూ.183 కోట్ల నిధులు తీసుకొచ్చానని, ఈ పనులు కాకుండా కొత్త పనులకు టెండర్లు పిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే 9 నెలల కాలం వృథా అయిపోయిందని, మెడికల్ కళాశాలలో ఇంకా కొన్ని అంతస్తుల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. నర్సంపేటకు జిల్లా వైద్యశాల రావడంతో అంతకుముందు ఉన్న సివిల్ ఆసుపత్రిని ఎత్తేయకుండా గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న నెక్కొండకు తరలించాలని కోరారు. దుగ్గొండి పీహెచ్‌సీని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, నియోజకవర్గంలో 53 పల్లె దవాఖానాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేయడం జరిగిందన్నారు. 29 దవాఖానల్లో సేవలు అందుతున్నాయని, ఇంకా మిగిలినవి పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరారు. పట్టణంలోని 3 బస్తీ దవాఖానల్లో రెండు పూర్తి చేశామని, మిగిలిన దవాఖానలను త్వరగా పూర్తి చేయాలన్నారు. నల్లబెల్లి మండలం కన్నారావుపేట గ్రామంలో సర్వే నంబర్ 58లో 54ఎకరాల సువిశాలమైన స్థలంలో హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని, వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను పాకాలకు తీసుకొచ్చామని, రంగాయచెరువు, పాకాల ప్రాజెక్టులను సాధించామన్నారు. వందల కోట్లతో రోడ్లు, హైలెవల్ బ్రిడ్జిలకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారని, ప్రస్తుతం అవి కార్యరూపం దాల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి విద్యాసంస్థ అయిన మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి సీఎం రావడం గౌరవప్రదంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది అన్నారు.

ధాన్యం డబ్బులు ఇవ్వకుండా..

- ఏడాదిగా తప్పించుకు తిరుగుతున్న వ్యాపారి
- వ్యాపారిని తీసుకొచ్చిన రైతులు
- పురుగుల మందు డబ్బాలతో రైతుల ఆందోళన

మాధన్నపేటలో పురుగుల మందు డబ్బాలతో రైతుల ఆందోళన

కమలాపూర్, సెప్టెంబర్ 15: ధాన్యం కొనుగోలు చేసి ఏడాది కావస్తున్నా డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యాపారిని రైతులు పట్టుకుని గ్రామానికి తీసుకొచ్చిన ఘటన మండలంలోని మాధన్నపేట గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామానికి చెందిన నామిని వెంకటేశ్, కొడుకు రాకేశ్ 2023లో మాధన్నపేటకు చెందిన వంగ సాంబయ్య, ఎగ్గడి శ్రీనివాస్,ఎగ్గడి సాంబయ్య, ఎగ్గడి సదయ్య, కుమ్మరి భిక్షపతి, కుమ్మరి బాబు, వంగ లింగమూర్తి అనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, 15 రోజుల్లో డబ్బులు చెల్లిస్తానని నమ్మబలికి తీసుకెళ్లారు. నెల రోజులు గడిచిపోవడంతో డబ్బులు అడుగగా తప్పించుకు తిరుగుతున్నారు. ఇలా పది నెలలు గడిచిపోయాయి. దీంతో బాధిత రైతులు శంకరపట్నం, హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టడంతో డబ్బులు ఇస్తానని బాండ్ పేపర్ మీద రాసిచ్చారు. బాండ్ పేపర్ రాసి ఇచ్చి నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం స్వగ్రామం ఆముదాలపల్లికి వ్యాపారి వెంకటేశ్ వచ్చిన విషయం తెలుసుకొన్న రైతులు అక్కడికి వెళ్లి అతడిని మాధన్నపేటకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కొడుకు రాకేశ్ 100 డయల్‌కు కాల్ చేశాడు. దీంతో మాధన్నపేట గ్రామానికి ఎస్సై వీరభద్రరావు సిబ్బందితో కలిసి వెళ్లడంతో రైతులు పురుగు మందు డబ్బాలు పట్టుకుని ఆందోళనకు దిగారు. డబ్బులు ఇవ్వకుంటే తమకు చావే శరణ్యమంటూ రైతులు పోలీసులను వేడుకున్నారు. ఎస్సైఐ రైతులకు నచ్చజెప్పి వ్యాపారి వెంకటేశ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బిడ్డ డెలివరీకి ఉందని బతిమిలాడినా పైసలు ఇయ్యలె..

బిడ్డ డెలివరీకి ఉంది.. పైసలు ఇయ్యమని బతిలాడినా ఇయ్యలె. ఆరుగాలం కష్టపడి పంట పండించిన వడ్లు అమ్మితే నమ్మించి మోసం చేసిండు. ఎంత బతిమిలాడినా దొరకకుండా తిరుగుతుండు. పనులు వదులుకుని మా ఆయన వడ్ల పైసల కోసం తిరగడంతో అదనంగా ఖర్చులు మీదపడ్డయి.

– ఎగ్గడి రజిత, రైతు